సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



ఏకదంతాయ.. వక్రతుండాయ

ఉమ్మడి పశ్చిమలో వినాయకుడి విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. మట్టి విగ్రహాలకే ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. 8లో ▸



శంకరమఠానికి రూ.లక్ష విరాళం

తాడేపల్లిగూడెం: శంకరమఠంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానానికి చక్కా ఉదయకుమార్, కాత్యాయని దంపతులు రూ. లక్ష విరాళంగా అందజేశారు.

రేపు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఈ నెల 7న ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ తెలిపారు. 8న సాయంత్రం ఉట్ల పండుగ, శ్రీవారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

న్యూస్‌రీల్

ఎల్లోమీడియా విశ్వసనీయత ఎక్కడ?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, చిత్రంలో మంత్రి కారుమూరి

సాక్షి, భీమవరం: ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులపై చంద్రబాబు నాయుడు ఎందుకు నోరు మెదపడం లేదని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రశ్నించారు. మంగళవారం భీమవరంలో విలేకరుల సమావేశంలో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. చంద్రబాబు అవినీతి గురించి దేశ ప్రజలందరికీ తెలుసునని, అందువల్లే 2019 ఎన్నికల్లో 23 అసెంబ్లీ సీట్లకే పరిమితం చేశారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 సీట్లలో గెలవడం ఖాయమని చెప్పారు. చంద్రబాబు అవినీతి, అక్రమాల వల్లే రెండెకరాల భూస్వామి వేలకోట్లకు పడగలెత్తారని ఎమ్మెల్యే గ్రంధి తెలిపారు. చంద్రబాబు అవినీతిపై ప్రజలకు చెప్పని ఎల్లో మీడియా విశ్వసనీయత ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో అవినీతికి ఆస్కారం లేని నీతివంతమైన పాలనను జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని, జగన్ ప్రభుత్వంపై ఎల్లో మీడియా, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎలాంటి దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని చెప్పారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్‌కు శ్రీవారి మెమెంటోను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్‌సుందర్ మంగళవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

జిల్లాలో అధికారుల బదిలీలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పలువురు ఉన్నతాధికారులు బదిలీకాగా వారి స్థానంలో కొత్త వారిని నియమించారు. పశ్చిమగోదావరి జిల్లా రెవెన్యూ అధికారిణి కె.కృష్ణవేణి జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ కాగా ఆమె స్థానంలో కృష్ణా జిల్లా ఎఫ్ఎస్ఓగా పనిచేస్తున్న జె.ఉదయ భాస్కర్ జిల్లా రెవెన్యూ అధికారిగా నియమితులయ్యారు. వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ పి.చెన్నయ్యను తాడేపల్లిగూడెం ఆర్డీఓగా నియమించారు. డిప్యూటీ కలెక్టర్ కె.ఝాన్సీ లక్ష్మిని జిల్లా హౌసింగ్ డిస్ట్రిక్ట్ మేనేజర్‌గా నియమించారు.

ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి నియోజకవర్గాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో నియోజకవర్గాల ఈఆర్వోలు, ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా తొలగించిన ఓట్లకు సంబంధించిన 3 రకాల రికార్డులను, ఓటర్ నోటీసులు, పంచనామా పత్రాల్లో అధికారుల సంతకాలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1400 ఓటర్లకు మించకుండా ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి ఓటర్ ఇంటి నెంబర్ ఉండాలని, ఏ ఇంటి నెంబరు ఏ పోలింగ్ కేంద్రంలో వస్తుందో పక్కాగా ఉండాలని సూచించారు. ఒకటి కంటే ఎక్కువ ఉన్న ఓట్లకు సంబంధించి తొలగించిన ఓటర్ల రికార్డులను పరిశీలిస్తారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో తొలగించిన ఓట్లలో ఓటర్ల నమోదు అధికారి 1000 ఓట్లను వివిధ పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించాలన్నారు. ప్రత్యేక అధికారులు 500 ఓట్లను, జిల్లా ఎన్నికల అధికారి 100 ఓట్లను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమం పకడ్బందీగా సాగాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఐరాసకు మన విద్యార్థులు

- రాష్ట్రంలో విద్యా సంస్కరణలపై ప్రసంగం
- ఐక్యరాజ్యసమితితో పాటు ప్రపంచ బ్యాంకు, కొలంబియా యూనివర్శిటీలో ప్రసంగించనున్న విద్యార్థులు
- సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం: విద్యార్థులు



అమెరికా వెళ్లే విద్యార్థులను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు

నూజివీడు: రాష్ట్రంలో అమలవుతున్న విద్యా సంస్కరణల ప్రభావం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ఏకంగా ఐక్యరాజ్యసమితిలో మాట్లాడే అవకాశం వచ్చింది. మన విద్యార్థులు ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అమలవుతున్న విద్యాసంస్కరణలతో పేదింటి పిల్లలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో పీయూసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న నలుగురు విద్యార్థులకు ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించే అరుదైన అవకాశాన్ని పొందారు. అంతేగాకుండా వీరు అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయం, ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయం, అమెరికా ప్రభుత్వ సమావేశాల్లో ప్రసంగించనున్నారు. ఈ నెల 15 నుంచి 27 వరకు వీరు అమెరికాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో స్థిరమైన వృద్ధి లక్ష్యాలపై, విద్యా సంస్కరణలపై ప్రసంగించనున్నారు.

ప్రభుత్వ పాఠశాల నుంచి అమెరికాకు..

అమెరికా పర్యటన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలైలో నిర్వహించిన అర్హత పరీక్షకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి 105 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ప్రభుత్వం 30 మందిని ఎంపిక చేయగా, వారిలో అమెరికాకు 10 మంది ఎంపికయ్యారు. ఈ పది మందిలో నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన నలుగురు విద్యార్థులు ఉండటం గమనార్హం. వీరిని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, ఏవో పీ ప్రదీప్ సోమవారం అభినందించారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ఈ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఐక్యరాజ్యసమితికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధులుగా వెళ్లడం గొప్ప అవకాశమని డైరెక్టర్ పేర్కొన్నారు.

ఎంతో ఆనందంగా ఉంది



చంద్రగిరి ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదివాను. పదో తరగతిలో 586 మార్కులు వచ్చాయి. నాన్న నాగరాజు కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. ప్రభుత్వం పరీక్షలు నిర్వహించి అమెరికా వెళ్లి అక్కడ ప్రసంగించే అవకాశాన్ని కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇలాంటి అవకాశం వస్తుందని నేను గాని, నా కుటుంబ సభ్యులు గాని ఎప్పుడూ అనుకోలేదు.

– వంజివాకు యోగీశ్వర్, నర్సింగాపురం, చంద్రగిరి మండలం, తిరుపతి జిల్లా

ఎంతో అదృష్టం



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యావ్యవస్థపై మాట్లాడే అవకాశం రావడం ఎంతో అదృష్టం. ఇలాంటి అవకాశం వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ అవకాశం కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. ఏలూరు జిల్లా టీ.నర్సాపురం మండలం అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో చదువుకున్నా. పదో తరగతిలో 581 మార్కులు వచ్చాయి. నాన్న గోపీ కౌలురైతుగా చేస్తున్నారు.

– జీ.గణేష్ అంజనసాయి, వల్లూరిపల్లి, పెంటపాడు మండలం, పశ్చిమగోదావరి

సీఎం జగన్ మేలు మరువలేం



చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయి వేదికపై ప్రసంగించే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉంది. నాకు ఇలాంటి అవకాశాన్ని ఇచ్చిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. నాడు- నేడు వంటి పథకాలతో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సదుపాయాలు కల్పించారు. పదో తరగతిలో 587మార్కులు వచ్చాయి. నాన్న ప్రైవేటు కంపెనీలో మెకానిక్‌గా పనిచేస్తారు.

– అల్లం రిషితారెడ్డి, విజయనగరం

పేద పిల్లలకు సీఎం జగన్ వరం



ఐక్యరాజ్య సమితికి వెళ్లే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. ఇంత మంచి సీఎం ఉండటం పేదవర్గాల పిల్లలకు వరం. విద్యార్థులకు కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయం. వట్లూరు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివా. 590 మార్కులు రావడంతో నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సీటు వచ్చింది. నాన్న పసుపులేటి రమేష్ రోజుకూలీగా పనిచేస్తారు.

– పసుపులేటి గాయత్రీ, వట్లూరు, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా

లోకేశ్ పప్పు కాదు.. వెర్రిపప్పు

అప్సడా వైస్ చైర్మన్ రఘురాం



తాడేపల్లిగూడెం: నారా లోకేశ్ పప్పు కాదు.. వెర్రి పప్పు అని అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం అన్నారు. మంగళవారం రాత్రి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆక్వా రంగంపై మాట్లాడే అర్హత నారా లోకేశ్‌కు లేదన్నారు. నారా లోకేశ్ పిట్టల దొరకు ఎక్కువ, భట్రాజుకు తక్కువ అన్నారు. ఆక్వా రంగం గురించి చంద్రబాబుకు, లోకేశ్‌కు, టీడీపీకి మాట్లాడే హక్కు లేదని.. అసలు ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ అనే పరిధిని పెట్టిందే చంద్రబాబు నాయుడని విమర్శించారు. బాబుకు అనుకూలంగా ఉన్న వారిని ఆక్వా జోన్‌లోకి, అనుకూలంగా లేని వారిని నాన్ ఆక్వా జోన్‌లోకి తీసుకొచ్చింది చంద్రబాబు కాదా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రిఫ్రెష్ సర్వే అనే యాప్‌ని ప్రవేశపెట్టి ఆక్వా రంగం మొత్తాన్ని ఒక తాటిమీదకు తీసుకొచ్చారని రఘురాం అన్నారు. అప్సడా ద్వారా ప్రభుత్వం సీడ్, ఫీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్ల మీద నియంత్రణ తీసుకొచ్చినట్టు చెప్పారు. రెండుసార్లు పెంచిన ఫీడ్ ధరను రోల్‌బ్యాక్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అని తెలిపారు. ఈ రాష్ట్రానికి పట్టిన పెద్ద వైరస్, చీడ చంద్రబాబు నాయుడు, అతని కొడుకు నారా లోకేశ్ అని చెప్పారు. లోకేశ్ యువగళం పెట్టింది తనకున్న ఒళ్లు తగ్గించుకోడానికే తప్ప ప్రజల కోసం కాదన్నారు. ప్రజల సమస్యలపై లోకేశ్‌కు అవగాహన ఉన్నట్టు కనిపించడం లేదని చెప్పారు.

ప్రణాళికాబద్ధంగా రీ సర్వే నిర్వహించాలి



మాట్లాడుతున్న జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

నరసాపురం రూరల్: ప్రణాళికా బద్ధంగా భూముల రీ సర్వే నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి అధ్యక్షతన శాశ్వత భూ హక్కు భూ రక్షణ పథకంపై నరసాపురం, మొగల్తూరు, పెనుమంత్ర మండలాలకు చెందిన తహసీల్దార్‌లు, రీ సర్వే డీటీలు, మండల సర్వేయర్‌లు, వీఆర్‌వో, విలేజ్ సర్వేయర్లకు ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో రైతులు భాగస్వాములుగా ఉండాలని వారికి ఎంత అవగాహన ఉంటే సర్వే అంత బాగా జరుగుతుందని అన్నారు. సర్వే సమయంలో రైతులకు నోటీసు ద్వారా తెలియజేయాలన్నారు. రీ సర్వేలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలనే అంశంపై వివరించారు. రీ సర్వే డ్రోన్స్‌పై రెండు సార్లు శిక్షణ ఇచ్చామని తెలిపారు. డీఆర్వో కె.కృష్ణవేణి, సర్వే అధికారి జాషువా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలవాలి

- మంత్రి కారుమూరి
- ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం





భీమవరంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మంత్రి కారుమూరి, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే శ్రీనివాస్, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

సాక్షి, భీమవరం: ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన గురు పూజోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధనతో సమాజంలో మార్పు తెచ్చి సమ సమాజ స్థాపనకు కంకణబద్ధులు కావాలని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యనిస్తుందని, నాడు-నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. పాఠశాలల్లో కుల, మతాల ప్రస్తావన ఎన్నడూ రాకూడదని మంత్రి హితవు చెప్పారు. ప్రభుత్వం విద్యారంగంలో తెచ్చిన మార్పుల కారణంగా మన రాష్ట్రం విద్యలో దేశంలో మూడో స్థానంలో నిలిచిందన్నారు.

విద్యాభివృద్ధికి వినూత్న పథకాలు

కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మన ప్రతిభను పరిచయం చేసే గొప్ప వ్యక్తులు ఉపాధ్యాయులేనన్నారు. విజ్ఞానానికి మారు పేరు గురువని, మాజీ భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురువుగా విద్యాభివృద్ధికి చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. ఉన్నతమైన విలువలు, అంకితభావంతో ఉపాధ్యాయ వృత్తిని నిర్వహిస్తున్నవారిని సమాజం మహానుభావులుగా కొనియాడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అవసరమైన వినూత్నమైన ప్రణాళికలను రూపొందించడంలో భాగంగా పాఠశాలలు, కళాశాలలో మౌలిక వసతులు కల్పిస్తుందని, విద్యార్థుల తల్లిదండ్రులకు విద్య భారం కాకూడదని ప్రభుత్వం అనేక విద్యాభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో ప్రతిష్టాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసిందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులను మంత్రి కారుమూరి, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే శ్రీనివాస్ చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసా పత్రం, శాలువాతో సత్కరించారు. ముందుగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహ రాజు, ఎస్ఆర్‌కేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగతిరాజు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, భీమవరం డిప్యూటీ డీవైఈవో శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

జాతి నిర్మాతలు ఉపాధ్యాయులు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల తరువాత అక్షరాలు నేర్పి పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు మొదటి స్థానంలో నిలుస్తారన్నారు. మంచి సమాజ నిర్మాణం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. ఉపాధ్యాయులకు ఎలాంటి అవసరమొచ్చినా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.

యువజన విభాగం కీలకం

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



మొగల్తూరు పాతకాలువ సెంటర్ నుంచి బైక్ ర్యాలీలో చీఫ్ విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: రాజకీయ పార్టీలకు యువజన విభాగమే కీలకమని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన యువజన విభాగం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సచివాలయం పరిధిలో ఇద్దరు గృహ సారథులు, కన్వీనర్లు, యువజన విభాగం అధ్యక్షులు రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్న ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. వైఎస్ఆర్‌సీపీ ఆరంభంలో ఒక పార్లమెంట్ సభ్యుడితో ప్రారంభమైన ప్రస్థానం 151 మంది ఎమ్మెల్యేలు, 23 మంది ఎంపీలకు చేరిందన్నారు. పార్టీ విజయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి చేసిన అవిరళ కృషి వల్లనే ఇది సాధ్యమైందన్నారు. అంతకు ముందు గ్రామానికి చేరుకున్న ప్రసాదరాజుకు పాతకాలువ సెంటర్ నుంచి వెంకటేశ్వర కళ్యాణ మండపం వరకూ యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ విభాగం అధ్యక్షుడు వేగి బాబి, మొగల్తూరు యూత్ అధ్యక్షుడు దూసనపూడి దొరబాబు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణ అందరి బాధ్యత

డీఎల్ఎస్ఏ కార్యదర్శి జి.రాజేశ్వరి



న్యాయసేవా సదన్‌లో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి జి.రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): కాలుష్య నివారణ అందరి బాధ్యతని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో కాలుష్య నియంత్రణ మండలి, డీఎల్ఎస్ఏ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడుతూ కాలుష్య నియంత్రణంలో సంబంధిత అధికారులు ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యవంతం చేయాలన్నారు. వినాయక చవితి సందర్భంగా ముందస్తు చర్యలపై చర్చించారు. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు లోబడి విగ్రహాలు తయారు చేయాలని, నిమజ్జన కార్యక్రమాలు ఉండాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల తయారీ, అమ్మకం నిషేధమన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో జలవనరులు, పర్యావరణం కలుషితమవుతున్నాయన్నారు. మూడు అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగి సహజమైన రంగులతో తయారు చేసినవి మాత్రమే ఉపయోగించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులతో మట్టి విగ్రహాల తయారీ వర్క్‌షాప్ నిర్వహించాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు, ఏలూరు డీఎస్పీ బి.శ్రీనివాసులు, పలువురు అధికారులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విజయవాడ వెళ్లి కొత్త పెన్షన్ అందజేత


విజయవాడ ఆస్పత్రిలో సత్యనారాయణకు పింఛను సొమ్ము అందజేస్తున్న వలంటీర్ మౌనిక

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన వనమాల సత్యనారాయణకు రెండు కిడ్నీలు చెడిపోవడంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వారం క్రితం చేరి చికిత్స పొందుతున్నాడు. కొన్నేళ్లుగా సుగర్ వ్యాధితో బాధపడుతుండగా, ఏడాది క్రితం అతని ఎడమ కాలు తొలగించారు. దీంతో కొత్తగా వికలాంగ పింఛనును ప్రభుత్వం మంజూరు చేయడంతో మంగళవారం గ్రామ వలంటీర్ రెబ్బ మౌనిక విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి సత్యనారాయణకు పింఛను సొమ్ము అందజేసింది. వలంటీర్ సేవలను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

రూ.3.50 లక్షల బంగారం, వెండి అపహరణ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజేష్, క్లూస్‌టీమ్ సిబ్బంది

జంగారెడ్డిగూడెం: స్థానిక సాలిపేటలో చర్చి రోడ్డులో జరిగిన చోరీ ఘటనలో రూ.3.50 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు సీఐ పి.రాజేష్ మంగళవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం ఇంటి యజమాని కొండా కాళిదాసు 10 రోజుల క్రితం ఇంటికి తాళంవేసి కుటుంబ సభ్యులతో సహా హైదరాబాద్ వెళ్లాడు. అయితే 4వ తేదీ సాయంత్రం కాళిదాసు కుమారుడు ఉమామహేష్, కోడలు ఇంటిని చూసేందుకు వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి తండ్రి కాళిదాసుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన మంగళవారం వచ్చి చోరీకి గురైన బంగారం, వెండి వస్తువుల వివరాలను పోలీసులకు తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై ఎం.సాగర్‌బాబు కేసు నమోదు చేశారు. కాగా మంగళవారం క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. 12 కాసుల బంగారు వస్తువులు, 3 కేజీల వెండి వస్తువులు, కొంత నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రైంపార్టీ ఏఎస్సై ఎస్‌వీ సంపత్ కుమార్, క్లూస్‌టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏక దంతాయ.. వక్రతుండాయ



పండుగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు, సామాజిక బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన తరుణమిది. ప్రజలకు ఇబ్బందులు కలిగించే, కాలుష్యానికి కారణమయ్యే పద్ధతులను పక్కనపెట్టి, పర్యావరణ హిత విధానాలకు ప్రాధాన్యమివ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో ఏటా జరుపుకునే గణపతి నవరాత్రి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకోవాలన్న స్పృహ అందరిలోనూ పెరిగింది. గ్రామ గ్రామానా మట్టి గణపతుల విగ్రహాల ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతుండటంతో మట్టి విగ్రహాల తయారీదారులకు ప్రోత్సాహం లభిస్తోంది.

- మహా 'మట్టి' గణపతి
- పర్యావరణ హిత సంప్రదాయాలపై పెరుగుతున్న ఆసక్తి
- జోరందుకున్న మట్టి వినాయక విగ్రహాల తయారీ
- 18 నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- మట్టి విగ్రహాల తయారీలో నిమగ్నమైన కళాకారులు

ద్వారకాతిరుమల: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఈనెల 18 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో గణనాథుల విగ్రహాల తయారీ ఊపందుకుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలు వినియోగించడం వల్ల వాతావరణం కలుషితం అవుతోంది. దీంతో గత కొన్నేళ్లుగా మట్టి వినాయక విగ్రహాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. అధికార యంత్రాంగం సైతం మట్టి విగ్రహాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఈ క్రమంలోనే గతేడాది జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో పలు స్వచ్ఛంద సేవా సంస్థల వారు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసి, వాటి ప్రాధాన్యతను చాటారు.


మేము సైతం అంటూ..

పర్యావరణ పరిరక్షణకు మేము సైతం అంటున్నారు విగ్రహాల తయారీదారులు. భీమడోలు మండలం పొలసానిపల్లికి చెందిన పేరవరపు నాగేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలసి మండలంలోని ఎం.నాగులపల్లి జాతీయ రహదారి పక్కన మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. వారికిదే జీవనోపాధి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో సునాయాసంగా విగ్రహాలు తయారు చేసే అవకాశం ఉన్నప్పటికీ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈ మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు నాగేశ్వరరావు లాంటి అనేక మంది వ్యాపారులు. మట్టితో తయారు చేసి, సహజ సిద్ధ రంగులు వేసిన విగ్రహాలను మాత్రమే వాడాలని తయారీదారులు, పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. భక్తులను ఆకర్షించే విధంగా విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. సాధారణంగా వినాయక విగ్రహాలను వైట్ సిమెంట్, ఫైబర్ అచ్చులతో వేసి తయారు చేస్తారు. అయితే వీరు మాత్రం విభిన్న ఆకృతులలో మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు.


తుది మెరుగులకు సిద్ధంగా ఉన్న మట్టి విగ్రహాలు


ఎం.నాగులపల్లిలో హైవే పక్కన మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్న కళాకారులు

ఇప్పుడిప్పుడే మొగ్గు చూపుతున్నారు



పర్యావరణ పరిరక్షణ కోసమే ఎన్నో ఏళ్లగా ఈ మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాను. ఈ ఏడాది దాదాపు వందకు పైగా విగ్రహాలను వివిధ సైజుల్లో తయారు చేశాం. కుటుంబమంతా కష్టపడితేనే అనుకున్న సమయానికి విగ్రహాలను చేయగలుగుతాం. విగ్రహాల తయారీలో ఎన్నో ఏళ్ల అనుభవం ఉంది. చాలా మంది ఇప్పుడిప్పుడే మట్టి విగ్రహాల వినియోగం వైపు మొగ్గు చూపుతున్నారు.

– పేరవరపు నాగేశ్వరరావు, మట్టి వినాయక విగ్రహాల తయారీదారుడు

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

ముదినేపల్లి రూరల్: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ఎస్సై వెంకట్‌కుమార్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరం గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక గత ఏడాది పాఠశాలకు సైకిల్‌పై వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన జగన్‌మోహనరావు అనే వ్యక్తి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. కొన్ని రోజుల తరువాత ఇలాగే వ్యవహరించడంతో బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై షణ్ముఖసాయి నిందితుడిని అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు విచారణ వేగవంతం చేసి మచిలీపట్నం పోక్సో కోర్టుకు నివేదిక అందజేశారు. దీనిపై విచారణ అనంతరం నిందితుడు జగన్‌మోహనరావుకు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారన్నారు.

తేజోమూర్తి ఆత్మహత్య కేసు దెందులూరుకు బదిలీ

ఏలూరు టౌన్: దెందులూరుకు చెందిన ప్రైవేటు ఉద్యోగి చెక్కా తేజోమూర్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఏలూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద రైల్వే ఎస్సై నరసింహారావు శవపంచనామా నిర్వహించారు. తేజోమూర్తి మరణానికి అతని భార్య ప్రియాంక, మామ సత్యనారాయణ, అత్త, భార్య సోదరి సౌజన్య, మేనమామ సురేష్, ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, ఏలూరుకు చెందిన న్యాయవాది సుబ్బారావు వేధింపులే కారణమని ఆరోపించారు. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో శవపంచనామా అనంతరం ఈ కేసును దెందులూరు పోలీసులకు తదుపరి దర్యాప్తునకు బదిలీ చేశారు.

మహిళల అభ్యున్నతికే ప్రభుత్వ పథకాలు

- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు
- డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు 4వ విడత సున్నా వడ్డీ చెక్కు అందజేత


డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ నమూనా చెక్కును అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: మహిళా సాధికారత, ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం పట్టణంలోని మండల సమాఖ్య భవనంలో మంగళవారం నిర్వహించిన డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు నాలుగో విడత వైఎస్సార్ సున్నా వడ్డీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 1,905 గ్రూపులకు గాను రూ.2.64 కోట్ల విలువ చేసే నమూనా చెక్కును సమాఖ్య ప్రెసిడెంట్లు, వీవోలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వరుసగా నాలుగో ఏడాది కూడా వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. పేద అక్కచెల్లెమ్మలకు సాధికారత కలిస్తూ వారు చేస్తున్న వ్యాపారాలకు ఊతమిచ్చేలా సున్నా వడ్డీకే రుణాలు అందించి వారి జీవన ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపరుస్తోందన్నారు. ఈ క్రమంలో బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల్లోని పేదింటి అక్కచెల్లెమ్మల మీద వడ్డీ భారం పడకుండా వారి తరపున ఆ భారాన్ని వైఎస్సార్ సున్నా వడ్డీ కింద నేరుగా పొదుపు సంఘాల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తుందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా సున్నా వడ్డీ పథకం ద్వారా నియోజకవర్గంలో సుమారు రూ.25 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండి ప్రజలకు తెలియ చెప్పాలన్నారు. కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదవాడికి భారంగా మారిన విద్య, వైద్యంలో విప్లవాత్మకంగా మార్పులు తీసుకువచ్చిన ప్రభుత్వం తమదేనని అన్నారు. ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కడలి రాంబాబు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అండ్రాజు చల్లారావు, చినిమిల్లి చంద్రశేఖర్, మైలాబత్తుల శ్రీను, ఏపీఎం పిప్పళ్ల పద్మ, మండల సమాఖ్య సిబ్బంది, వీవోలు, ప్రెసిడెంట్లు, నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన పెంచాలి


పోడూరు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్

పోడూరు: బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై సమాజంలో విస్తృతంగా అవగాహన పెంచాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ అంగన్‌వాడీ టీచర్లకు పిలుపునిచ్చారు. పోడూరు ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాల్యవివాహాలలో రాష్ట్రం దేశంలోనే మొదటిస్థానంలో ఉందన్నారు. బాల్యవివాహాల వల్ల జరిగే సామాజిక, ఆరోగ్యపరమైన సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాల్లో బాల్యవివాహ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. కమిటీలో సభ్యులైన అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శి బాల్యవివాహాలు జరగకుండా అడ్డుకోవాలని, ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర, ఎంఈఓ జి.సూర్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శ్రీవారి దేవస్థానం ఈఓకు తొలగిన అదనపు బాధ్యతలు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా అదనపు బాధ్యతలను కొన్నాళ్లుగా నిర్వరిస్తుండటం తెలిసిందే. అయితే సింహాచలం దేవస్థానానికి ఈఓగా డిప్యూటీ కలెక్టర్ ఎస్.శ్రీనివాసమూర్తిని నియమిస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి జీఓను జారీ చేయడంతో ఆయన అదనపు బాధ్యతల నుంచి తొలిగారు.

భళా.. ద్వారకాతిరుమల విద్యార్థి ప్రతిభ


- శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల పూర్వ విద్యార్థి దిలీప్‌కుమార్
- బ్యాటరీ బైక్‌ను తయారు చేసి ప్రదర్శన
- 3 గంటల చార్జింగ్‌తో 60 కి.మీ మైలేజ్


బ్యాటరీ బైక్‌ను పాఠశాల ఆవరణలో ప్రదర్శిస్తున్న విద్యార్థి దిలీప్‌కుమార్


దిలీప్‌కుమార్ తయారు చేసిన బ్యాటరీ బైక్ ఇదే..


ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల పూర్వ విద్యార్థి బ్యాటరీ బైక్‌ను తయారు చేసి తన ప్రతిభను చాటాడు. మండలంలోని కొమ్మర గ్రామానికి చెందిన మండా దిలీప్‌కుమార్ స్థానిక పాఠశాలలో గతేడాది పదోతరగతి పూర్తి చేశాడు. ప్రస్తుతం నల్లజర్ల మండలం దూబచర్ల ఎలైట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే స్థానిక పాఠశాలలో ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థుల సహాయంతో అతడు ఈ బ్యాటరీ బైక్‌ను తయారు చేశాడు. లిథియం బ్యాటరీలను ఉపయోగించి, 3 గంటల చార్జింగ్‌తో, 60 కిలోమీటర్లు ప్రయాణించేలా దీన్ని రూపొందించాడు. పెట్రోల్‌తో పనిలేకుండా ఈ వాహనం నడుస్తుందని దిలీప్‌కుమార్ తెలిపాడు. మిగిలిన విద్యార్థులను ప్రోత్సహించే క్రమంలో మంగళవారం పాఠశాల ఆవరణలో ఈ బైక్‌ను ప్రదర్శించారు. ఇదిలా ఉంటే దిలీప్‌కుమార్ ఈ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న సమయంలో సైన్స్ ఫెయిర్ అవార్డును సైతం అందుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు అతడిని అభినందించారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి


ఆస్పత్రిలో మృతి చెందిన మావుళ్లయ్య

భీమడోలు: మద్యం మత్తులో ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే.. దుద్దేపూడి పంచాయతీ శివారు అన్నేవారిగూడెంకు చెందిన గుర్రం మావుళ్లయ్య (25) అనే యువకుడు కూలీ పనులు చేసుకుంటాడు. అయితే చిన్న వయస్సులోనే మద్యానికి అలవాటై కూలి డబ్బులు కూడా ఇంటికి తీసుకుని రాకుండా పూర్తిగా మద్యానికి ఖర్చు పెడుతుండడంతో అతనిని తండ్రి మందలించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మామిళ్లయ్య మద్యం మత్తులో గత నెల 27న రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆ యువకుడిని కుటుంబ సభ్యులు స్థానికుల సహకారంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం విషమించడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భీమడోలు హెచ్‌సీ సూరిశెట్టి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్తుపల్లి సమీపంలో డ్రైవర్ మృతదేహం లభ్యం


సత్యన్నారాయణపురం ఆయిల్‌పామ్ తోటలో పడి ఉన్న యువకుడి మృతదేహం

చింతలపూడి: సత్తుపల్లి మండలం సత్యన్నారాయణపురం సమీపంలోని ఆయిల్‌పామ్ తోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల విచారణలో మృతదేహాన్ని చింతలపూడి మండలం లింగగూడెం గ్రామానికి చెందిన చిమట చెన్న కేశవరావు (35)గా గుర్తించారు. మృతుడు కొబ్బరి బొండాల వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడని కుటుంబసభ్యులు తెలిపారు. మూడు రోజుల క్రితం బయటికి వెళ్లిన కేశవరావు తెలంగాణ సరిహద్దులో శవమై తేలడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి భార్య , ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సత్తుపల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

కొయ్యలగూడెం: బైక్‌పై వెళుతుండగా వెనక నుంచి లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రామానుజపురం గ్రామానికి చెందిన చాపల రమేష్ (35)కలిసి సోమవారం రాత్రి బైక్‌పై మరో ముగ్గురు బంధువులతో కలసి పోతవరం వెళుతుండగా బయన్నగూడెం సమీపంలో రాజమండ్రి వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్‌కు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ముగ్గురు గాయాలపాలయ్యారు. 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్‌కి క్షతగాత్రులను తరలించగా రమేష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

మౌలిక సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న జిజ్జువరపు రవిప్రకాష్

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలు నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లిగూడెంలోని బీవీఆర్ కళా కేంద్రంలో దళితసేన జిల్లా అధ్యక్షుడు చీలి మోహనరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. రవిప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, తాగునీటి వసతి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో దళితసేన పెంటపాడు మండల అధ్యక్షుడు చదలవాడ శ్రీనివాస్, తాడేపల్లిగూడెం పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో వృద్ధునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రంగబాబు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామానికి చెందిన వలంటీర్ రాజమండ్రిలోని జీఎస్ఎల్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న వృద్ధునికి పింఛన్ అందజేశారు. సోమవారం రాత్రి తేతలి 2వ సచివాలయం వాలంటీర్ కాసాని రంగబాబు రాజమండ్రి వెళ్లి జీఎస్ఎల్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న గ్రామానికి చెందిన ఉర్రింకల నాగేశ్వరరావుకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు.

ఆరుగొలను వాసికి ఏలూరులో పింఛన్ అందజేత



నాగరాజుకు ఏలూరులో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కాంచన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామానికి చెందిన కామన నాగరాజు ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు గ్రామానికి చెందిన వలంటీర్ బయ్యే కాంచన ఆస్పత్రికి వెళ్లి పింఛన్‌ను అందజేశారు. సుమారు 60 కిలో మీటర్ల దూరంలో ఉన్న లబ్ధిదారునికి పింఛన్ అందజేసిన వలంటీర్‌ను పలువురు అభినందించారు.

ఎల్ఐసీ బీమాతో కుటుంబానికి భరోసా



తణుకులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్ఐసీ బీఎం రాజశేఖర్, ఏజెంట్లు

తణుకు అర్బన్: ఎల్ఐసీ బీమా ఖాతాదారుడి కుటుంబానికి భరోసాను కల్పిస్తుందని తణుకు బ్రాంచ్ సీనియర్ మేనేజరు కేఎస్ రాజశేఖర్ అన్నారు. ఎల్ఐసీ 67వ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తణుకులో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ పాలసీ పొదుపు, బీమా అంశంలోనూ ఖాతాదారులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. కోట్లాది రూపాయిల టర్నోవర్‌తో వట వృక్షంలా ఎదిగిన సంస్థ సేవా కార్యక్రమాల్లో కూడా ముందు వరుసలోనే ఉందని స్పష్టం చేశారు. సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండేలా పలు సౌకర్యాలతో పాలసీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు సీహెచ్ఎస్ రామకృష్ణ, పుష్పరాజ్, సుబ్రహ్మణ్యం, తణుకు బ్రాంచ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం ఆర్డీఓగా చెన్నయ్య

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ఆర్‌డీఓగా పి.చెన్నయ్యను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒంగోలు ప్రత్యేక కలెక్టర్‌కు పీఏగా ఉన్న ఆయనకు బదిలీల్లో భాగంగా ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు.

16న తణుకులో సినీ సంగీత కార్యక్రమం

తణుకు టౌన్: గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా ఈనెల 16వ తేదీన తణుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన సినీ సంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వై.నాగరాజ కుమార్, ఎం.రవి రిజనాల్డ్, కోశాధికారి ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆ రోజు సాయంత్రం లయన్స్ ఆడిటోరియంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో తణుకు రాజు ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన గాయకులు, కళాకారులు పాల్గొంటారని తెలిపారు.

దేశ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



తాడేపల్లిగూడెం నిట్‌లో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు



అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ హైస్కూల్‌లో రిటైర్డ్ హెచ్‌ఎం సుబ్బారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం : దేశ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని నిట్‌లో మంగళవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యార్థుల భవితను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల తర్వాత బాధ్యత గురువులదే అన్నారు. విద్యార్థులు ఏ రంగంలో రాణించినా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను మర్చిపోకూడదన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పి.శంకరరెడ్డి, డీన్ రీసెర్చ్, కన్సల్టెన్సీ జీఆర్‌కే శాస్త్రి, డీన్‌లు టి.కురుమయ్య, జీబీ వీరేష్‌కుమార్ పాల్గొన్నారు.

గురువు పాత్ర క్రియాశీలకం

తాడేపల్లిగూడెం : గురువు పాత్ర క్రియాశీలకం అని ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ చలం అన్నారు. మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యాన టీచర్స్ డే వేడుకలు జరిగాయి. డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య పాల్గొన్నారు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, క్లబ్ అధ్యక్షుడు వంగపండు రామ్మోహన్‌రావు హాజరయ్యారు. 12వ వార్డు పాతూరు మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దాట్ల జగన్నాధరాజు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో హెచ్ఎం సత్యనారాయణను, ఎన్‌సీసీ అధికారి గణపతిరావును సత్కరించారు.

మహనీయుడు రాధాకృష్ణన్

అత్తిలి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్రపతి పదవిని అలంకరించిన మహనీయుడని బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్సీఎం దత్ చెప్పారు. పాఠశాలలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం దత్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఉపాధ్యాయ లోకానికి ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో 2010లో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేసిన వీవీ సుబ్బారావును, 2007లో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేసిన సోమరాజును పాఠశాల తరపున సన్మానించారు. అదేవిధంగా విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పలు పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆకుల మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకుడు ఉపాధ్యాయుడు

తాడేపల్లిగూడెం అర్బన్ : సమాజానికి నిర్దేశకుడు ఉపాధ్యాయుడని డాక్టర్ ధూళిపాల ప్రభాకర కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో తెలుగు సాహితీ సమాఖ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యాస హృదయం అనే అంశంపై ప్రసంగించారు. వేమూరి శ్రీనివాసరావు, పసుపులేటి రామచంద్రరావు, సూరంపూడి వెంకటరమణ, లింగాల సత్యనారాయణ, ఎంవీ చంద్రశేఖర్‌లను సత్కరించారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, గోదావరి ప్రభాకర్ శాస్త్రి, గరికిపాటి బాపయ్య శర్మ పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

పెంటపాడు: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు తప్పక గుర్తుంచుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ అన్నారు. జట్లపాలెం ఎంపీయూపీ పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు. సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, హెచ్ఎం శోభనాద్రి, కట్టుబోయిన నాగేశ్వరరావు, అత్తిలి సుబ్బారావు, వరదా రమణయ్య పాల్గొన్నారు.



పెంటపాడులో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

ఉపాధ్యాయుల సేవలు మరువలేం

పెంటపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మానవత సంస్థ చైర్మన్ తాడేపల్లి మోహనరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, టీవీ రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎంపీపీ దాసరి హైమావతి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, పెంటపాడు, కొండేపాడు, ఆకుతీగపాడు, ముదునూరు, వల్లూరుపల్లి గ్రామాల సర్పంచ్‌లు తాడేపల్లి సూర్యకళ, కట్టా దానయ్య, దాసం వెంకటేశ్వర్లు, భావన ధాన్యలక్ష్మి, దంగేటి రామస్వామితో పాటు ఎంపీడీవో సీహెచ్ బాలాజీ, ఉపాధ్యా సంఘ నాయకులు మురళీకృష్ణ, పాలూరి రామకృష్ణ, రమేష్, శామ్యూల్‌రాజు, స్టాన్లీ బాబు, దొడ్డిగర్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు సార్థకత చేకూర్చాలి

తణుకు టౌన్: ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యకు సార్థకత చేకూర్చేలా బోధన చేయాలని కళాశాల విద్య ఆర్‌జేడీ సీహెచ్ కృష్ణ అన్నారు. తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరిబాయి, అధ్యాపకురాలు డాక్టర్ జి.అమృతవల్లీ పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకు సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

అత్తిలి: అత్తిలి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన మంచిలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నేలపాటి వెంకటరమణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలో ఉత్తమ సేవలు అందిస్తున్న 9 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మక్కా సూర్యనారాయణ మాట్లాడుతూ మానవత సేవలు ప్రశంసనీయమన్నారు. పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు జి.విజయలక్ష్మి, ఎం.నారాయణరాజు, కేవీ రామకృష్ణ, బి.రాజేశ్వరి, జి.సుధాకర్, ఎస్.సూర్యసత్యకుమారి, పి.ప్రశాంతరాజు, వి.దుర్గబాబు, కె లావణ్యలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతారామయ్య, వైస్ ఎంపీపీ దారం శిరీషా, ఎంఈవోలు రమేష్, ప్రసాద్, రిటైర్డు ఎంఈవో శీతాల వెంకటనారాయణ, మానవత మండల అధ్యక్ష, కార్యదర్శులు బోడపాటి సూర్యచంద్రరావు, కొరిపల్లి హరి, అత్తిలి టౌన్ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, జిల్లా కార్యదర్శి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

మున్సిపల్ స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలి



తణుకులో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తణుకు: మున్సిపల్ స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ కోరారు. మంగళవారం తణుకు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించిన అనంతరం ఎంఈవో మురళికు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ స్వీపర్లకు 5 నెలల బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.26 వేలు నెలకు వేతనం కోరారు. కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, శారద, సత్యవతి, బంగారమ్మ, అర్జునమ్మ, ఆదిలక్ష్మి, రామలక్ష్మి, ధనలక్ష్మి, హేమలత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న నున్న దుర్గాప్రసాద్

తణుకు టౌన్: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కోసం పనిచేసే గృహసారథులకు జగనన్న ప్రభుత్వం అందిస్తున్న బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు కోరారు. మంగళవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన గృహసారథులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా గృహసారథుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ కరిబండి రాజేష్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్ కుమార్, మండల మహిళా అధ్యక్షురాలు చుంద్రు శ్యామల, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు పాల్గొన్నారు.

పెంట్లమ్మకు చల్ది నైవేద్యాలు



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

పెంటపాడు: పెంటపాడు గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారికి చల్ది నైవేద్యాలు సమర్పించారు. శ్రావణ మాసం మూడో మంగళవారం పురస్కరించుకుని ప్రతి ఏటా అమ్మవారి పూరిగుడి వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. గత 100సంవత్సరాలనుంచి ఈ కార్యక్రమం ఆనవాయితీగా వస్తోంది. కాగా ప్రతి ఏడేళ్లకు ఒకసారి అమ్మవారి జాతర ఘనంగా చేయడం పరిపాటి. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యాన గ్రామంలో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. సత్తి నరసారెడ్డి, చామన విజయకుమార్, కొవ్వూరి బాల భాస్కర రెడ్డి, శీలంశెట్టి రామచంద్రరావు, చామన వెంకట సురేష్, వెలగల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ యువజన సంఘం ఏర్పాటు



ఆకివీడు అగ్నికుల క్షత్రియ యువజన సంఘం సభ్యులు

ఆకివీడు: విలువలను కాపాడుకుంటూ, సమసమాజం కోసం ఆధ్యాత్మికత్వాన్ని పెంపొందించే విధంగా తమ యువజన సంఘం కృషి చేస్తుందని ఆకివీడు అగ్నికుల క్షత్రియ యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు వల్లభుని నాగరాజు, కారాడి వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక వనువులమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం యువజన సంఘం నూతన కమిటీని ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడుగా వల్లభుని నాగరాజు, కార్యదర్శిగా కారాడి వెంకటేశ్వరరావు, క్యాషియర్‌లుగా పొనమండ కనకరాజు, కారాడి పెద్దిరాజు, ఉపాధ్యక్షులుగా పోనాల సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా రామడి నర్శింహాస్వామి, కమిటీ సభ్యులుగా బొడ్డురాజేష్, బసవని శ్రీను, కొల్లటి సత్తిబాబు, బర్రెనాగరాజు, పొనమండ సత్యనారాయణ ఎంపికయ్యారు. నూతన కమిటీ పలు సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

వృద్ధులకు భరోసా పింఛన్

ఆకివీడు: వృద్ధులకు ప్రతినెలా పింఛన్ అందించడంతో వారి జీవిత భరోసా కల్పించినట్లు అయ్యిందని ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు చెప్పారు. స్థానిక నగర పంచాయతీలోని 20వ వార్డులో కొత్త పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులను వలంటీర్ల ద్వారా గుర్తించి, ఆన్‌లైన్ ద్వారా ప్రతీ ఆరునెలలకొకసారి కొత్త పింఛన్లు పంపిణీ చేయడం ప్రభుత్వ పారదర్శక విధానానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, వార్డు కౌన్సిలర్ మోటుపల్లి కుమారి, మాదివాడ దేవస్థానముల చైర్మన్లు మోటుపల్లి రాజు, గునుకుల కొండయ్య, ఆర్బీకే చైర్మన్ కేశిరెడ్డి దుర్గారావు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

భీమవరం అర్బన్: ఎంతోమంది ప్రమాదాల్లో క్షతగాత్రులై కళ్లు కోల్పోయి అంధ జీవితాన్ని గడుపుతున్నారని వారికి మరణాంతరం నేత్రదానం చేస్తే ఎంతో పుణ్యమని వైద్యాధికారిని డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి అన్నారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ నేత్రదాన ప్రాముఖ్యతను తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి రామకృష్ణ, డీహెచ్ఎస్ యు.పుష్ప, ఎంపీహెచ్‌ఈవో పాల్గొన్నారు.

పోలీసుల పట్ల నమ్మకం కలిగేలా పనిచేయండి



డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను కలిసిన గూడెం రూరల్ ఎస్సై బోనగిరి రాజు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను రూరల్ ఎస్సై బోనగిరి రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజలకు పోలీసుల పట్ల నమ్మకం కలిగేలా సిబ్బంది పనిచేయాలని డిప్యూటీ సీఎం సూచించారు.

నవజాత శిశువులకు వైద్యసేవలపై అవగాహన



వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ముదునూరు డాక్టర్లు

తాడేపల్లిగూడెం : నవజాత శిశువులకు అంబులెన్స్ వైద్యసేవలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు అందించే సేవలను వైద్యులు డాక్టర్ వెంకట్, డాక్టర్ పూజిత వివరించారు. నియోజకవర్గ స్థాయిలో అందుబాటులో ఉన్న ఈ అంబులెన్సులో అత్యాధునిక నియోనేటర్, వెంటిలేటర్, మోనిటర్, ఇంక్యుబేటర్, సిరంజ్ పంప్, ఇన్‌ఫ్యూజన్ పంపు, ఆక్సిజన్ వంటి సదుపాయాలు ఉంటాయని, సకాలంలో వైద్యసేవలు అందుతాయని తెలిపారు. 108 జోనల్ మేనేజర్ గణేష్, జిల్లా మేనేజర్ ప్రకాష్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పెంటపాడులో..

పెంటపాడు: నవజాత శిశువులకు వైద్యసేవలు ఎంతో అవసరమని, ప్రధానంగా ఆక్సిజన్ లోపం రాకుండా నియోనేటల్ తప్పక ఉండాలని ముదునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ ఎస్వీ రమణ, డాక్టర్ పూజిత పేర్కొన్నారు. 108 నియోనేటల్‌పై మంగళవారం సిబ్బందికి డాక్టర్లు అవగాహన కల్పించారు. జిల్లాకు అందిన ఒక్క వాహనం తణుకు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సిద్ధంగా ఉంటుందన్నారు. అప్పుడే పుట్టిన శిశువులకు ఆక్సిజన్ లోపం రాకుండా, నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా నియోనేటల్ కృషి ఎంతో అవసరమన్నారు. వెంటిలేటర్, పంప్, ఇంక్యుబేటర్ తదితర విభాగాలను సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది పాల్గొన్నారు.

ఫణిశ్రీకి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

అత్తిలి: గురుపూజోత్సవం సందర్భంగా భీమవరంలో జరిగిన కార్యక్రమంలో అత్తిలి మండలం ఈడూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.ఫణిశ్రీ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, డీఈఓ ఎన్వీ రమణ చేతులు మీదుగా అందుకున్నారు. పాఠశాలల నాడు–నేడు విభాగంలో ఫణిశ్రీ ఈ అవార్డుకు ఎంపికయ్యారు.


నేడు పాలకోడేరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పాలకోడేరు: పాలకోడేరు గ్రామంలో సచివాలయం 2 పరిధిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీవీఎల్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన అవసరం

ఉండి: వరి సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రామలింగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉండి రైతు భరోసా కేంద్రంలో ఆధ్వర్యంలో ఆత్మ ఆధ్వర్యంలో జిల్లా వనరుల కేంద్రం ద్వారా రైతులకు వ్యవసాయంలో ప్రస్తుత పరిస్థితులపై అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి చేలకు వచ్చే తెగుళ్లు, వాటి సస్యరక్షణ చర్యల గురించి రైతులు వ్యవసాయాధికారుల ద్వారా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలి



భీమవరంలో టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సాక్షి, భీమవరం: పట్టణంలో 82 ఎకరాల్లో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను వెంటనే పేదలకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం టిడ్కో ఇళ్లను సీపీఎం బృందం పరిశీలించింది ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటుచేసిన రెండు పూటలా మంచినీరు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు, ఎం వైకుంఠరావు, కె కృష్ణ, డి నాగు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా

సాక్షి, భీమవరం: డ్వాక్రా యానిమేటర్లు, ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమవరం కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.అజయ్‌కుమారి మాట్లాడుతూ ఎంతో సేవ చేస్తున్న యానిమేటర్లు, ఆర్పీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

తణుకు డిగ్రీ కళాశాలలో ఆర్‌జేడీ విచారణ

తణుకు టౌన్: తణుకులోని ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహణపై వచ్చిన ఆరోపణలపై మంగళవారం కళాశాల విద్య రాజమండ్రి ప్రాంతీయ సంచాలకులు చప్పిడి కృష్ణ విచారణ చేశారు. మంగళవారం మధ్యాహ్నం కళాశాలను సందర్శించిన ఆయన కళాశాల పరిపాలన, విద్యా బోధనకు సంబంధించిన పలు అంశాలపై అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఆర్‌జేడీ తెలిపారు. విచారణకు సంబంధించిన నివేదికను కళాశాల విద్యా శాఖాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.